(ఆంధ్రజ్యోతి వీక్లీ: నవంబరు 78)

# శ్రీ ఆంజనేయమ్, ప్రసన్నాంజనేయమ్

రాత్రి పన్నెండై వుంటుంది టైం, విజయవాడ స్టేషనని తెలుస్తోంది. రామచంద్రరావుకి....రైలు చాలాసేపయి ఆగివుంది.

బయటినుంచి వచ్చే ధ్వనులవల్ల పెద్దగా నిద్రాభంగం లేదు.కాని, లోపల తిరుగుతున్నాయనిపిస్తున్న ఫ్యాన్లవల్ల వొచ్చేగాలి బొత్తిగా చాలడం లేదు. అతనికి మెలకువ వచ్చేసి కొంతసేపయింది. కళ్ళు తెరవాలనిపించలేదు. కాని, తప్పింది కాదు. దుప్పటిలోపల పైజామా సరిచేసుకుని దుప్పటి పక్కకి తప్పించాడు. కళ్ళుతెరిచి పక్కకి చూశాడు.

"నమస్కారం సార్!"

చిరునవ్వూ, జోడించిన చేతులూ-అతను రఘురామ్. రామచంద్రరావు ఆశ్చర్యపడ్డాడు. "నమస్కారం!" అని ఒక చెయ్యి ఆడించాడు. ఈ ట్రాన్స్ఫర్ తప్పకపోతే తను రఘురామ్ దగ్గిరే ఛార్జి తీసుకోవాలి విజయనగరంలో.ఆ విషయం మనసులో చైతన్యవంతంగా ఉండడాన్ని కాబోలు, రావలసిన ప్రసన్నత రాలేదు మొహంలోకి.

"హైదరాబాదేనా సార్: ప్రయాణం!"

"ఊఁ....ప్లెజంట్ సర్ ప్రయిజ్-నువ్వూ హైదరాబాదేగా?"

ఆరేళ్ళ క్రిందట రఘురామ్ సరాసరి తను చేస్తున్న ఉద్యోగానికి నియమితుడైనాడు-గ్రూప్వన్-సర్వీసెస్ పరీక్షరాసి, తను అప్పుడు గుంటూర్లో ఉండేవాడు. అతనికి ట్రెయినింగ్ యిమ్మని తనకే వొప్పగించారు.ఆ రెండు నెలలూ అయ్యాక అనంతపురంలో జిల్లా ఆఫీస్ నిర్వహించమని పోస్టింగ్ ఆర్డర్స్ రాగా వెళ్ళిపోయినవాడు: మళ్ళీ యిదే కనపడ్డం మధ్యలో మూడేళ్ళనాడు ఈ డిపార్టుమెంటులోని జిల్లా అధికారులందరికీ హైదరాబాదులో ఏర్పాటు చేసిన సమావేశానికి రఘురామ్ రాకుండా పి. ఏ. ని పంపించి, తను సెలవులో వెళ్ళాడు-పెళ్ళట (అతనికే!) తిరుపతి కొండమీద.

రామచంద్రరావు షేక్హాండిచ్చాడు."నీ పెళ్ళికి రాలేకపోయినాను సరిగా అదే రోజున కాన్ఫరెన్సు-గుర్తుందిగా?"

"మీరు అభిమానంతో పంపిన శుభాకాంక్షలు అందాయి....మీలాంటి పెద్దలు గురుదేవులు అనేకమంది ఆశీర్వదించారు. అప్పుడప్పుడవి చూసుకుని గర్వపడుతూ వుంటాను!"

"ఊఁ. ఎలా వున్నావు? పిల్లలా?" అని నవ్వుతూ అడిగాడు రామచంద్ర రావు.

"అవును సార్"-ఒక వేలు చూపించి "బాబు" అన్నాడు రఘురామ్ "అయామ్ హాపీ."

రామచంద్రరావుకి, తను హైదరాబాదు వెడుతున్న కారణం రఘురామ్ చెప్పేయ్యాలని వుంది. తన ఆందోళనలో చెప్పేస్తానేమోనని అనుమానంగా వుంది. చెప్పకపోయినా అతను గ్రహించేస్తాడేమో అని. మాటల్లో పెట్టి తన చేత చెప్పించేస్తాడేమోననీ భయంగా వుంది. అతనితో చెప్పేస్తే అతను సాయ పడతాడని ఆశగా. అతను కూడా ట్రాన్స్‌ఫర్ ఆపించుకుందికే హైదరాబాద్ వెడుతున్నాడని ఆశ్వాసగా వుంది.

"ఈ చెయిన్‌లో నిన్నెక్కడ వేశారు?"

చెయిన్-అది అ ట్రాన్స్‌ఫర్ల రకం పేరు. విశాఖపట్నంలో ఉన్నవాణ్ని ఏలూరు, కడపవాణ్ని విశాఖపట్నం. శ్రీకాకుళం వాణ్ని కడప, నిజామాబాద్ వాణ్ని శ్రీకాకుళం-ఇలా ఈ జిల్లాస్థాయి అధికారులని పేకముక్కలు కలిపినట్టు కలిపి ఎవరికి ఏ స్థలం వస్తుందో వూహకి అందని విషయంగా చేస్తారు, అంత కన్నా పై అధికారులు మూడేసి సంవత్సరాలకోసారి వస్తుం దిలాంటి భూకంపం. అందులో కొందరు అదృష్టవంతులు అవతలి మనుషులు రాకపోవడంచేత, కొందరు గడుసువాళ్ళు తమ పలుకుబడివల్ల కదలక్కర్లేకపోవడంచేత, ఎక్కడి వాళ్ళు అక్కడే కొనసాగుతారు. చిన్న ఉద్యోగస్తుల్లాగ తల్లికో, తండ్రికో జబ్బు అనో, భార్యకి నెలలు నిండాయనో, పిల్లల చదువులు దెబ్బతింటున్నా యనో కారణాలు రాసి ట్రాన్స్‌ఫర్ ఆపించండి బాబూ అని ప్రార్థించరు. ఉన్న ట్టుండి హైదరాబాద్ ప్రయాణం కడతారు. ఎవర్నో కలుస్తారు. ఏమిటేమిటో చదువుతారు. (చదివిస్తారు.) ఇంకా పలుకుబడి కలవాళ్లు ఒక ట్రంక్ టెలిఫోన్ కాల్ చేసి ఊరుకుంటారు. అంతే. ఎక్కడి దొంగలు అక్కడే గప్‌చిప్.అలాం టివి సాధ్యంకాని వాళ్ళు ట్రాన్స్‌వర్ అంటే అభ్యంతరం లేనివాళ్ళు కదిలి వెళతారు.

రఘురామ్ చిరునవ్వుతో "నన్ను డైరెక్టర్ ఆఫీసులో. ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ-గా వేశారు. ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాలకి సరాసరి రిక్రూట్‌మెంట్ జరిగిందిగా, ఈ మధ్య! ఆ ముప్పయ్యిద్దరికీ శిక్షణ యిమ్మని...." అన్నాడు.

"ఔనౌను!" రామచంద్రరావుకి నిజంగానే గుర్తు వచ్చింది. "అదిసరే: నువ్వు ఇక్కడెక్కడ వేం: వాల్తేరురో ఎక్కక!"

"డైరెక్టర్‌గారు నిన్న మచిలీపట్నంలో క్యాంపు. వార్ని ఇక్కడకొచ్చి కలుసుకోమని రాశారు, ఇందాకే ఆయన నెల్లూరు వెళ్లారు. నన్ను హైదరాబాద్ అర్జంటుగా వెళ్ళమన్నారు. మీరు రావడం. ఛార్జి పుచ్చుకోవడం. నన్ను రిలీవ్ చెయ్యడం ఇవన్నీ అలా వుంచి, ముందుగా హైదరాబాద్‌లో పెట్టబోయే ట్రెయినింగ్ క్లాసుకి వసతి చూడవలసిందని ఆర్డర్సు. ఆర్నెల్లకోసం ఏదో బిల్డింగ్ అద్దెకి సంపాదించాలి.

"ఏం మనిషివయ్యా, డ్యూటీమీద వెడుతూకూడా సెకండ్ క్లాసులో ఎక్కేశావు!"

"మొన్న టపాలో వచ్చాయి సార్ ఆర్డర్స్.... ఇక్కడిదాకా ఫస్ట్‌క్లాస్‌లోనే వచ్చాను. ఇక్కణ్నుంచి హైద్రాబాదుకి ఇంత తక్కువ వ్యవధిలో - ఫస్ట్ క్లాస్‌మాట అటుంచి-సెకండ్ క్లాస్ దొరకడమే గగనం అయిపోయింది!"

ఆరునెలలయితేనేం? తంతే గార్లెగంపలో పడ్డట్టు హైదరాబాద్‌లో పడ్డాడు. మామగారికి పెద్ద బంగళా వుంది. రెండు కార్లు, ఒక జీపు ఉన్నాయి. ఈ ఆరునెలల్లో జిల్లా ఆఫీసర్ పోస్టునుంచి అసిస్టెంటు డైరెక్టర్ ప్రమోషన్‌కు రూట్ వేస్తాడన్నది ఖాయం. అక్కణ్నుంచి మళ్ళీ జిల్లాలకి రానక్కర్లేదు, డిప్యూటీ డైరెక్టర్ అయితే తప్ప, అప్పుడైనా, అప్పటికి హైదరాబాద్‌లో ఉండే ఇద్దరు డిప్యూటీ డైరెక్టర్లలో ఒకణ్ని ట్రాన్స్‌ఫర్ చేయించేసి తను హైదరాబాదులోనే వుండిపోగలడు....

"విజయనగరం బావుంటుంది సార్" అన్నాడు రఘురామ్.

"వేస్తున్నాడు వల!" అనుకున్నాడు రామచంద్రరావు.

"కొత్త జిల్లా, పెద్దగా వర్క్ లేదు.... భవనానికి స్థలం చిక్కింది. బిల్డింగ్ కట్టడానికి డబ్బుకూడా శాంక్షన్ అయింది. టెండర్లు పిల్చాం...." చెప్పబోతున్నాడు రఘురామ్.

"ఐసీ-ఇలాంటప్పుడు నీలాంటి యువకులు అక్కడుండి డిపార్టుమెంటుని పటిష్టం చేస్తే బాగుండేది-"

"కింది ఉద్యోగాల్లో ఇంకా చాలవరకు భర్తీ చెయ్యవలసిన పనుంది. తాలూకాల్లో జూనియర్ ఇన్‌స్పెక్టర్స్‌ని వేసే నిమిత్తం ఇంటర్వ్యూ దగ్గర కొచ్చింది. మూడు తాలూకాల్లో భవనాలు కట్టడానికి ఎస్టిమేట్లు అయ్యాయి-"

"అయ్య బాబోయ్. ఇప్పుడా పెంటంతా ఎవడు పడతాడయ్యా నాయనా! అంచేత నాకు ఈ ట్రాన్స్‌ఫర్ ఎలాగైనా తప్పిపోతే బావుండునని వుంది. పైగా మా అమ్మాయికి పెళ్ళి కుదిరింది, నెల్లాళ్ళలో ముహూర్తం! మా అబ్బాయికి ఉద్యోగం రావాలి. ఈ రెండూ నేను కాకినాడలో ఉండగా అయిపోతే చాలు నని చూస్తూ వుంటే, ఇంతలోనే పిడుగులా వొచ్చింది, ఈ దిక్కుమాలిన ట్రాన్స్‌ఫర్ ఆర్డరు!" అని రామచంద్రరావు నెత్తి కొట్టుకున్నాడు.

రఘురామ్ అతన్ని పిచ్చివాణ్ని చూసినట్టు చూశాడు. "కొంపతీసి ట్రాన్స్‌ఫర్ ఆపించుకోడానికిగాని హైదరాబాదు వెళ్తున్నారేమిటి?" అన్నాడు.

"అయిపోయింది!.... వీడిదగ్గరా నాగుట్టు!" అనుకుని మొహం వేలేశాడు రామచంద్రరావు.

"సార్! మీరేం అనుకోకపోతే, కొంచెం లైటు తీసేస్తారూ! కాసేపు నిద్రపోతాను" పై బెర్తుమీద ఆసామీ అడిగాడు.

"అయ్యో, ఎంత మాట!" అని రఘురామ్ లైటు తీసేశాడు.

సికింద్రాబాదులో దిగిపోతూ, రఘురామ్ అన్నాడు! "సరే- ఎలాగా ఇంతదూరం వొచ్చారు. చెయ్యవలసిన ప్రయత్నమేదో చెయ్యండి. మీ ట్రాన్స్‌ఫర్ తప్పిపోతే మీకు సంతోషం అని తెలుస్తూనే వుంది. కాని నాకు మాత్రం దానివల్ల ఇబ్బందేమీలేదు. అది మీకూ తెలుసు. అక్కడ మిమ్మల్ని కాకపోతే మరొకర్ని వేస్తారు- నేను ఒ. ఎస్. డి. గా జాయిన్ కావాలిగనక, అయితే మీరు విజయనగరంలో జాయిన్ కావడానికి కూడా ఏమీ సందేహించనక్కర్లేదు. అక్కడ ఆంజనేయులని పి. ఏ. ఉన్నాడు మహోన్నతమైన వ్యక్తి. మీరేదో అమ్మాయి పెళ్ళి- అబ్బాయి ఉద్యోగం అని ఊ- భయపడిపోతున్నారు. నిర్మొగమాటంగా అతనికి మీ సమస్యలు చెప్పెయ్యండి. కంటిలో నలుసు తీసినట్టు కాల్లో ముల్లు తీసినట్టు, చెవిలో గులిమి తీసినట్టు, అట్టే మాటాడితే ఇస్త్రీచొక్కా మీద వాలిన ఈగని తోలేసినట్టు- అన్నీ పరిష్కరించేస్తాడు,నమ్మండి."

"ఔరా ఎంతవాడవయ్యావురా!" అనుకొన్నాడు రామచంద్రరావు, రఘురామ్ తనని అక్కడికి లాగే ప్రయత్నం చూసి.

*  *  *

"పెళ్ళిచేసి చూడు!" అన్నారుట పూర్వులెవరోను. మరి ఆ రోజుల్లో అంత కష్టంగా ఉండేదేమో- అనిపించింది రామచంద్రరావుకి, అంతా సవ్యంగా జరిగిపోయాక.

ట్రాన్స్ఫర్ తప్పదు- అని రూఢి కాగానే కాకినాడలో తన పి.ఏ గా పని చేస్తున్న నారాయణరావుతో ఉత్తరం రాయించాడు, విజయనగరంలో తన పి.ఏ. గా పని చెయ్యబోతున్న అంజనేయులికి. వీలుంటే ఒకసారి వచ్చి వెళ్ళమని.

అంతే, మర్నాటికల్లా వాయుపుత్రుడిలా వచ్చి వాలాడు ఆంజనేయులు.

రిలీవ్ అయిన మర్నాడు బయలుదేరి వచ్చెయ్యడానికి కారు,లారీ. ఏర్పాటు చేసేశానన్నాడు. మీరు అక్కడికి వచ్చేలోగా, వుండడానికి ఇల్లు సిద్ధం- అని హామీ ఇచ్చాడు.

"మరి పెళ్ళి ఎక్కడ చెయ్యాలయ్యా" అన్నాడు రామచంద్రరావు.

"ఏమిటి. విజయనగరంలో పెళ్ళిళ్ళే జరగడం లేదంటారా సార్?" అన్నాడు చిరునవ్వుతో ఆంజనేయులు.

"అదికాదు, వివాహానికి వేదిక కావాలి, విడిదికి వసతికావాలి.... నీళ్ళు, పాలు సరుకూ, సబ్బురా, వంటవాళ్ళు, పనివాళ్ళు ఇదీ అదీ ఎన్ని ప్రాబ్లెమ్స్! వియ్యాలవారు దాదాపు వందమంది వస్తారు, అంతా ఒకేరోజున ఒకే ట్రెయిన్లో మళ్ళా గుంటూరు వెళతారుట. అందరికీ ఒక్కసారి రైల్లో రిజర్వేషన్లు ఇక్కడైతే సర్కార్ ఎక్స్ప్రెస్ వుంది! ఎక్కించెయ్యొచ్చు అనుకున్నాం. బోలెడు పట్టుబట్టలూ అని పెడదామని వొప్పేసుకున్నాం. వాళ్ళతరపు నగలన్నీ కూడా మమ్మల్నే చేయించేమన్నారు. ఇంకా పట్నాలవారి షాపులో చెబుదామనుకొంటున్నాం.... ఇంతకీ నేనింకా బొమ్మ రెడీ చేసిపెట్టుకొనేలేదు— ఏమిటో; అంతా గాభరాగా ఉందయ్యా..."

ఆంజనేయులు మొహంమీంచి ఆ చిరునవ్వు పోలేదు. "సార్ అన్నీ నా కొదిలెయ్యండి! మీరు పీట్లమీదప్పుడు పీట్లమీద; మిగతా టైమప్పుడు కుర్చీలోనూ అలా కూర్చోండి. అన్నీ అలా జరిగిపోతాయి!.... ఇక్కడున్నట్టే అక్కడా సత్రాలున్నాయి. ఇక్కడ సర్కార్ ఎక్స్ప్రెస్ వుంటే, అక్కడ

ఈస్టుకోస్టు ఎక్స్‌ప్రెస్సుంది. ఇక్కడి పట్నాల వారుంటే అక్కడ నాగులకొండ వారున్నారు. ఇక్కడ మీ పి. ఏ గా నారాయణరావుంటే అక్కడ ఆంజనేయు లుంటాడు!"

....అంతా ఒక తియ్యని కలలాగ గడిచిపోయింది.... దాదాపు ఇరవై ఎనిమిదివేలు ఖర్చయినట్టు తెలుస్తోంది అన్నిటికీ కలిసి. అందులో తను తెచ్చి ఇచ్చింది పదహారువేలు. అంతే.... తను ఐదారుమంది పి. ఏ. లను చూశాడు, కాని ఇలాగ ఎక్కడా లేదు!

"మీకు తెలియాలి కాబట్టి చెబుతున్నాను సార్. ఇదుగో ఇతను- మన ఆఫీసు బిల్డింగు కట్టే శాయికృష్ణ పట్నాయక్. బిల్డింగ్ స్టాండర్డ్స్ అన్నీ ఆర్. అండ్. బి. ఇంజనీర్లే చూసుకుంటారనుకోండి. కాని ఫైనల్ బిల్లు మనద్వారానే వెడుతుందండి. అందుకని తమర్ని చూద్దామని వొచ్చాడు."

"అంతే సార్!" అన్నాడు ఆ శాయికృష్ణపట్నాయక్. అమాయకంగా మొహంపెట్టి.

0 0 0

"జూనియర్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు ఇదివరకు నింపినవి కాక మొత్తం పధ్నాలుగు ఖాళీలు సార్, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్‌ఛేంజ్ వారు ముప్పయ్యెనిమిది మందిని పంపారు, రిజర్వేషన్ పోస్టులు నాలుగు సార్. అవికాక పదిఖాళీలు సార్. తమరు సెలక్షన్ చేసినట్టు ఆర్డర్స్ వేసిన ఈ పదిమందిలో శాయికృష్ణ పట్నాయక్ గారి కేండిడేట్ ఒక్కడే సార్. లిస్టులో ఈ యిద్దరూ మాత్రం ఫర్నిచర్ కాంట్రాక్టర్ అప్పలస్వామిగారి తాలూకు సార్. వారిచేత తమ దర్శనం విడిగా చేయిస్తాను సార్. అయిదుగురు ప్యూర్ మెరిట్ మీద వొచ్చిన వాళ్ళు సార్. ఒకరేమో తమ అల్లుడిగారి క్లాస్‌మేట్ సార్...." అని వివరం చెప్పాడు ఆంజనేయులు. ఒక కొత్త బ్రీఫ్‌కేసు టీపాయ్ మీద రామచంద్రరావు వైపు గొళ్ళాలు పెట్టి ఇలా తెరిచి అంతలోనే మూసేసి- ఆయన కళ్ళు జిగేల్ మనడం సహించలేని వాడిలాగ- "ఇక మిగిలిందినేను చెప్పిన కాండిడేట్ సార్" అన్నాడు మామూలుగా.

"అతన్ని నేను డ్రాప్ చేసేద్దామనుకున్నాను. కాని మీరెందుకో పట్టు బట్టారు మరి" అన్నాడు రామచంద్రరావు కళ్ళు జిగేల్మనడం వల్ల కాబోలు, మాట మెత్తనై.

"తమరు దానికి నన్ను క్షమించాలి సార్.... ఎందుకంటే ఈ కాండిడేట్ మామగారు విశాఖపట్నంలో ఒక పెద్ద సంస్థలో పెర్సనల్ ఆఫీసర్ సార్. అక్కడ మన జగన్‌బాబుకి - అదే అబ్బాయిగారికి- ఉద్యోగం కోసం గట్టిగా ప్రయత్నం చెయ్యమని చెప్పారు కదండీ—"

ఎక్కడెక్కడ ఎవరెవర్ని యెలా యెలా పడతాడో తెలీదు. అంతా అయి పోయాక గానీ తన స్కీమేమిటో చెప్పడు, ఆపన్లు చేయించడానికి సామ దాన భేద దండోపాయాల్లో దేన్ని అవలంబిస్తాడో అసలు తెలియనివ్వడు. అమ్మబాబోయ్, వీడు రాజకీయాల్లో వుంటే రోజుకో మంత్రిని మార్చిపారెయ్యడూ ?—అను కున్నాడు రామచంద్రరావు.

పోనీ అ_స్తమానూ తిరిగినట్టూ ఉండడు మరి. పి.ఏ. అన్న తరవాత ఆఫీసును కాసుకొని కూర్చోవాలికదా. అక్షరాలా అంతే చేస్తాడు. అయితే 'ఫోను రాక్షసుడు'లా ఆఫీసులో వుండే తొమ్మిది గంటల్లోనూ అయిదువందల నిమిషాలు ఫోనులోనే వుంటాడు. ఆ మిగిలిన నలభై నిమిషాలూ తనదగ్గర 'అత్యర్జంటు', 'యమర్జెంటు' 'అర్జెంటు', 'ఆడ్నరీ'- కాగితాలమీద సంతకాలు తీసుకోడానికీ 'స్పీక' డానికీనూ!

0 0 0

"ఆ అమ్మాయిని ఇన్నాళ్ళూ సరిగా చూడనేలేదు ! ఘోరంగా మిస్ అయ్యాను!" అనుకున్నాడు రామచంద్రరావు. ఆడిట్ పార్టీవాళ్ళు తమ అభ్యంత రాలన్నిటికీ రాత్రికి రాత్రి సమాధానాలు కావాలని పట్టు పట్టిన ఆరోజు తరవాత. సరిగ్గా ఆ రోజునే ఆంజనేయులు వాళ్ళ నాన్నగారికి సీరియస్‌గా వుందని అమలా పురం వెళ్ళకపోతే, ఆ సమాధానాలన్నీ తను డిక్టేట్ చెయ్యకుండా అతనే తయారు చేసుకునుండేవాడు: ఆ అమ్మాయిని అసలు చూసే ఉండకపోదును!

....చచ్చు పీనుగ, తనని పూర్తిగా అన్ని విధాలా 'సుఖ' పెట్టలేని పెర్సనల్ అసిస్టెంటు!....

స్టెనోగ్రాఫరు - ఆ అమ్మాయి ....
లీలారాణి - ఆ అమ్మాయి పేరు—
ఇరవై ఆరేళ్ళు - ఆ అమ్మాయి వయసు—
పాచ్చటి వసుపు. ఆ అమ్మాయి రంగు.
పుష్టి, ఆరోగ్యం, నునుపు, మెరుపు - ఆ అమ్మాయి శరీరం—
నాజూకు, నవత - ఆ అమ్మాయి నడక. నడత—

అప్పను—బంట్రోతు సింహాచలంగాడు, ఎకౌంటెంట్ అచ్యుతరామయ్య, హెడ్ గుమస్తా రంగాచారిగారు - ఇలా వివిధ ఏజ్ గ్రూప్‌ల వాళ్ళు-అందరూ ఆ అమ్మాయిని ఆశగా, ఆకలిగా చూస్తూ వుండడం అన్యమనస్కంగానైనా ఆందోళనతో చూశాడు రామచంద్రరావు.

మొత్తం అయిదుగంటలసేపు కూర్చుంది తన రూమ్‌లో, తన ఎదురుగా, ఆ రాత్రి లీలారాణి అయిదువందల సార్లయినా తన కళ్ళలో కళ్ళుపెట్టి చూసింది. పోనీ- తను అయిదుగంటలపాటూ ఆమె కళ్ళలోకే చూస్తూ కూర్చుంటే, తను చెప్పిన వాక్యమో, మాటో, అక్షరమో, ఆశ్చర్యార్థకమో - ఉర్దూలాంటి ఆ అర్థం కాని లిపిలో రాసేసి, తరవాత ఏం చెబుతారు'సా'రన్నట్టు తన కళ్ళ ల్లోకి ప్రశ్నార్థకంగా చూసింది.

టైపు కొడుతూ బ్లైండ్ టచ్‌లో తనని 'బ్లైండ్ ఫోల్డ్' చేసి, ప్రశ్నార్థ కంగా చూసింది.

ప్రశ్నార్థకమే, మరి!....

తనేమైనా శ్రీ రామచంద్రుడా ?

అయితే, ఏమాట కామాటే - పదేళ్ళ నాడు అమ్మాయి ఈడేరిన నాటి నుంచి నేటివరకు మాత్రం—

ఇప్పుడు మళ్ళానా?

అవును— ఇప్పుడేమిటి, తన బాధ్యతలు?

ఏమీలేవు—

అమ్మాయికి పెళ్ళై అత్తారింటికి వెళ్ళిపోయింది. అబ్బాయికి ఉద్యోగమై విశాఖపట్నంలో ఉంటున్నాడు.

భార్య తన సంపాదనమీద, ప్రతిష్ఠమీద నెరవేర్చేసిన బాధ్యతలమీద, తృప్తితో, గౌరవంతో రెండు పూట్లా నిద్రపోతోంది- కడుపునిండా తిని!

తనకి వయసుమాత్రం ఏం మీరిపోయిందని? మొగాడికి యాభై ఏళ్ళొక వయస్సా?

సర్వీస్ రిజిస్టర్‌లో చాలా వివరాలుంటాయి........

కేస్ట్- దేవదాసి. వెదర్ మేరీడ్— విడోడ్,

బొట్టుపెట్టుకొని రంగు చీరలు కట్టే ఈ సుందరీమణి విధవయా? ఎంత దుర్భరం మెంత దుఃఖావహము!

అడవికాచిన వెన్నెలా?

పరువంలో వైధవ్యమా?

ప్రశ్నార్థకాలే- అన్నీను....

ఈ ఆంజనేయులుగాడితో ఎన్ని చేయించుకున్నాను! ఎంత చేరదీశాను వీణ్ణి!

వీడితో నేను చెప్పలేని మాట అంటూ లేదు-ఇప్పటివరకు.

ఇది చెప్పగలనా?

ఇదీ చెప్పగలనా?

చెప్పాలి.... చెప్పక వీల్లేదు.... వాడే, వాడే, వాడే సమర్థుడు, ఏ ఏర్పాటుకైనా....

వాడు కాలాంతకుడు, దేవాంతకుడు! అయితే అస్మదీయుడు!

రానీ, వాణ్ని అమలాపురం నుంచి—

"మీ నాన్నగారి కెలా వుంది? సరైన వైద్యం చేయించేవా? పోనీ వైజాగ్ తీసుకురాకపోయావా? మంచి ఆసుపత్రి వుంది కదా.... అసలు నీకు బుర్ర లేదయ్యా. ఈ వయసులో ఆయన్నక్కడ ఒంటరిగా వదలి— అమలాపురంలో అరటితోట వుంటే మటుకు?— నీ దగ్గరుంటే వచ్చే తృప్తి, ఆరోగ్యం తనివి అక్కడొస్తాయా?"

ఇలా మాట్లాడొచ్చు.

"ముప్ఫయ్యేళ్ళు వొచ్చాయి నీకు. ఇంకా పెళ్ళి చేసుకోవేం? మంచి పిల్లని చూసి పెళ్ళి చేసుకుని, కోడలిచేత ఆయనకి సేవ చేయించలేవు, ఎందుకు? ఊళ్ళో వాళ్ళందరికీ అడ్డమైన వుపకారాలు చేస్తావు! నీ స్వంత తండ్రిని గాలికి వదిలేసి!.... ఛఛ! ఇదేం బాగులేదయ్యా. ఆంజనేయులూ!"

ఇలా చొరవ చెయ్యొచ్చు. ఇందులో పెద్ద చొరవ మాత్రం ఏముంది? అతను నా పెర్సనల్ అసిస్టెంటు. అతని వ్యక్తిగత వివరాలు నేను భోగట్టా చెయ్యాలి. నా "పెర్సనల్" విషయాలలో అతని సహాయం తీసుకోవాలి—

"ఫాదర్ ఎక్స్‌పైర్డ్- ప్రే ఎక్స్‌టెన్షన్ లీవ్ ఫిఫ్టీన్ డేస్- ఆంజనేయులు.,

చంపేశాడ్రా బాబూ........ ముసిలాడు- వాడు చావడం కాదుగాని- నన్ను చంపి వదిలిపెట్టాడు. పదిహేను రోజులు సెలవు పొడిగించేశాడు "నా పెర్సనల్" అసిస్టెంటు!

ముసిలాడు ఇక్కడైనా వచ్చేడు కాదు.... అప్పుడప్పుడు కనబడుతూనైనా ఉండేవాడు ఆంజనేయులు....

ఎన్ని పన్లు బాకీ ఉండిపోయాయి!

ఎన్ని ముఖ్యమైన పన్లు....

అర్జంటు పన్లు....

"పెర్సనల్" పన్లు....

ఒక్కటి కాదే, వాడు లేందే!

ఒక్కటి—

పోనీ, ఆ ఒక్కటీ.... అసలు కాదే!

....................—

ఐడియా!

ఎలాగా ఈ పదిహేడో తారీకున హైదరాబాద్‌లో జరిగే కాన్ఫరెన్సుకి వాడు రాలేడు—

"స్టెనోగ్రాపర్ శ్రీమతి లీలారాణి హైదరాబాదు కాన్ఫరెన్సుకి జిల్లా ఆఫీసర్ని ఫాలో కావలెను"

హద్దదీ, వేస్సేను ఆర్డర్.... ఛక్ ఛకా, ఫట్ ఫటా!

అయిదు వందల మైళ్ళు ఇటూ, అయిదు వందల మైళ్ళు అటూ ప్రయాణం!

అయిదు రోజులు కలసివుంటాం....

అయిదు గంటలు కాదు—

అయిదు నిమిషాల్లో తేలిపోయింది సమస్య!

అయిదు వందల అడ్వాన్స్ టి.ఏ. శాంక్షన్డ్.

0 0 0

"పి.ఏ. గారెప్పుడొస్తారు సార్?"

"పి.ఏ. గారైతే తమర్ని బాగా అర్థం చేసుకుంటారు సార్."

"పి.ఏ. గారుండి వుంటే ఈ పొరపాటు జరిగేది కాద్సార్."

"పి.ఏ. గారితో చెప్పండి సార్, ఆయనొచ్చేక"

—ఔనన్లేదు. కాని, కాదన్లేదుగా....

ఆంజనేయులుతో చెప్పమంటోంది.... ఆంజనేయుల్నే అడగమంటోంది.. అడుగుతాను. నాకేం మొహమాటమా?........ (తొందరపడకూడదు!)

ఇంకెన్నాళ్ళు?.... ఇవాళ ఇరవయ్యో తారీకు.... ఎల్లుండి కల్లా వొచ్చేస్తాడు!

* * * *

"సార్——" హెడ్గుమాస్తా రంగాచారిగారు.

"ఎస్–"

"ఐదయిపోయింది. తమరింకా ఆఫీసులో ఉంటారా సార్"

"ఏం. మీరు వెళ్ళిపోతారా?"

"అవును సార్, ఇవాళ మధ్యాహ్నం పి.ఏ.గారు ఇంటికొచ్చేశారు సార్. వాళ్ళ నాయనగారు పోయారు కదా, సార్."

"అవునండీ, పాపం...."

"ఆఫీస్ స్టాఫ్ అంతా వెళ్ళి పరామర్శ చేయాలనుకొంటున్నాం సార్."

"ఓ, అదా!.... అలాగే, అలాగే తప్పకుండా వెళ్ళండి.... సరే, నేనూ వెళ్ళిపోతాను; వాచ్ మేన్ని పచ్చి తాళాలు వేసెయ్యమనండి.... అర్జంటు కాగితాలింకేం లేవు కదా"

"లేవు సార్."

క్షణాలమీద నిర్ణయాని కొచ్చాడు రామచంద్రరావు. తనుకూడా వెళ్ళి నాలుగు సానుభూతి వాక్యాలు పలకాలి.

ఇంటికి వెళ్ళి ప్యాంటూ, కోటూ విడిచాడు, మొహం కడుక్కుని, సబ్బు వల్ల అంటుకునే తెల్లటి తెలుపును సన్నటి గుడ్డతో తుడిచేసుకున్నాడు. జీప్లో వెళ్ళకూడదని ముందే నిర్ణయించుకోడంవల్ల జీప్ డ్రైవర్ని పంపేశాడు. వీధి గుమ్మంలోకెళ్ళి ఆలా వెళ్తున్న ఒక రిక్షాను ఆపి బేరం చేశాడు.

"వాళ్ళమ్మగారు ముందే పోయారటగా! లేకపోతే నేనూ వద్దును." అంది ఇల్లాలు.

"ఆఁ, అయినా నువ్వెందుకులే! అతనేం మన చుట్టమా, బంధువా? మన యింట్లో మనిషిగా కలిసిపోయా డనుకో.... అయితే మాత్రం? అది అతని స్వభావం, అంతే! మన పొజిషన్లో యెవరుంటే వాళ్ళతోనే అతనలా కలిసిపోతాడు."

"మరేవండీ.... పాపం, మంచివాడు!"

"ఆఫీసులో వాళ్ళంతా వెళ్ళారు.... మనలో ఎవరో ఒకరు వెళ్ళకపోతే బాగుండదు.... చిన్నబుచ్చుకుంటాడు.... అంచేత నేనే ఒకసారి వెళ్ళి పలకరించి వచ్చేద్దామనుకొంటున్నాను...."

రామచంద్రరావు వెళ్ళేసరికి ఆఫీసు స్టాఫ్ అంతా ఇవతలికి వచ్చేస్తున్నారు.

అయినా ఆంజనేయులు ఉండే ఇల్లు రద్దీగానే వుంది పరామర్శకు వచ్చిన వాళ్ళతో.

అక్కడ—

నిల్చున్న వాళ్ళు, కూర్చున్న వాళ్ళు, వరండాలో అక్కడా అక్కడా కొద్ది శబ్దంతో మాట్లాడుకుంటున్న వాళ్ళు— కంట్రాక్టర్లు. పాత ఆఫీస్ బిల్డింగ్ యజమాని- ఇరుగు పొరుగు వాళ్ళు- దగ్గర తాలూకాల ఉద్యోగులు- కొద్దిమంది బంధువులు కూడా ఉన్నట్టున్నారు.......

ఏ ఒక్కరి మొహం చూసినా ఆంజనేయులికి వొచ్చిన కష్టంపట్ల నిజంగా సానుభూతి కలిగిన వాళ్ళలాగే ఉన్నారు.... ఒక్కసారి రామచంద్రరావుకి ఒళ్ళు గగుర్పొడిచింది. కాని వెంటనే అతను సర్దుకున్నాడు- ఏముందీ— "హల్లో! మిష్టర్ ఆంజనేయులు! చాలా విచారకరమైన వార్త. ....నేను షాకయ్యాను. ఆ రోజు నీ టెలిగ్రాం చూసి.... పాపం. మీ ఫాదరు.... గట్టిగా అరవై ఏళ్ళు లేవటగా.... ఇట్స్ వెరీ అన్‌ఫార్చునేట్.... మరేమిటి సంగతులు? మీరెంత మంది అన్నదమ్ములు? హౌ ఎబౌట్ సిస్టర్స్? నువ్వు పెద్ద కొడుకువి కాదనుకుంటానే—పోన్లే. ఆ విధంగా కొన్ని బాధ్యతలు తగ్గాయి నీకు.... ఐనా, నాకనిపిస్తుంది— మీ ఫాదర్‌కి జబ్బుగా ఉందని తెలియగానే ఆయన్ని నీ దగ్గరికి ఈ వూరు తీసుకొచ్చెయ్యవలసింది. పూర్ సోల్.... ఇంతమంది ఉండీ కూడా ఒంటరిగా పోయినాడు.... ఐయామ్ సో సారీ ఆంజనేయులు!.... అయితే ఏమిటి?— ఆఖరి చూపు కనీసం నీకైనా దక్కిందా? ఐసీ-ఇట్స్ వర్స్.... పోనీ, ఆస్తి గురించి స్పష్టంగా విల్లు రాశాడు కదా. అందువల్ల హెడేక్ తగ్గింది.... ఎనీవే- నువ్వు ధైర్యంగా ఉండాలి.... లాటాఫ్ లైఫ్ ఎ హెడ్......... ఆఫ్టరాల్, డెత్ ఈజ్ కామన్...." ఒక్క అక్షరం కూడా మర్చిపోకుండా—

రామచంద్రరావు మాటలు వింటూ, మధ్యలో సమాధానాలు చెబుతూ,

అంజనేయులు అతన్ని లోపలి గదిలోకి తీసుకు వెళ్ళాడు. చక్కటి ఆ గదిలో, మిక్కిలి సదుపాయంగా, సౌఖ్యంగా కూర్చున్న రామచంద్రరావు అక్కడొక వింత ప్రపంచాన్ని చూసేడు....

బోలెడు పుస్తకాలు—

ఎన్నో బహుమతి వస్తువులు—

మరెన్నో కానుకలు—

గోడలకి మంచి పెయింటింగులు—

అవసరాలు, సౌఖ్యాలు, విలాస వస్తువులు; అన్నిరకాలూ వున్నాయక్కడ. ఆ గదుల అలంకరణ పాతదే అయినా హుందాగా వుంది....

"అదలా వుంచు. నీ మంచితనం కారణం గానీ, నీ పనివాడితనం కారణంగానీ— ఇవాళ నీ యింటికి వచ్చిన జనం- ఇన్నిరకాల వాళ్ళు ఇంత మంది! వీళ్ళని చూసేసరికి; వీళ్ళ కళ్ళలో నీమీన కురుస్తున్న సానుభూతి చూసే సరికి. మీ నాన్నగారు పోయినందుకు నాకు నిజంగా కలిగిన విచారం అంతా పోయిందనుకో! ఒక్కసారిగా నువ్వు నా పెర్సనల్ అసిస్టెంటువి, ఇంత జన ప్రియుడివిగా, అజాత శత్రువుగా వున్నావని నాకెంతో సంతోషం కలిగింది. దానికి కారణం నాకు తెలుసు. నువ్వు యెవరు- ఏమి- అడిగినా తప్పకుండా యిస్తావు, చేస్తావు! నాకు నిజంగా గర్వంగా వుందనుకో!" ("నాకు కొంచెం అసూయగా వుంది" అనేమాట మింగెయ్య గలిగినందుకు కూడా ఆనందిస్తూ) అన్నాడు రామచంద్రరావు. ఈ ధోరణి యిప్పుడు అవసరం. అతన్ని కొంచెం కీర్తించడంవల్ల ఒక ముఖ్యమైన "స్వంత" పని నెరవేరుతుంది.

"అంతా మీ వంటివారి దయ సార్, నాదేముంది? కేవలం నా వుద్యోగం మీద శ్రద్ధా, నా అధికారులమీద భక్తీ; అంతే!" అని పక్కకి చూశాడు ఆంజనేయులు.

[ఏ సంజ్ఞ చెప్పిందో, ఏ సందేశం విన్నదో, స్టెనోగ్రాఫర్ శ్రీమతి లీలారాణి, ప్రస్తుతం కష్టంలోవున్న అంజనేయులికి ఒక సాంసారిక నెచ్చెలిలా, నిరాడంబరమైన వేషంలో రెండు సాసర్లలో రెండు కప్పులతో కాఫీ తీసుకొని, ఆ సమయానికి ఆ గదిలో అడుగుపెట్టింది]

రామచంద్రరావు ఆ నిరాడంబర సౌందర్యం కూడా ఒక కళాకారుడి కుండే ఆశా పరిశీలనతో ఆస్వాదించి కాఫీ అందుకొన్నాడు....

"అయితే సార్, నాదొక్క మనవి" ఆంజనేయులు మాట్లాడడం ప్రారంభించాడు; కాఫీ కప్పు పక్కన పెట్టి. "తమరున్నారండి! తమరు రామచంద్రరావుగారండి. నేనున్నానండి! నేను ఆంజనేయుల్నండి. నేను మీ సేవకుణ్ణండి. నేను మీ భక్తుణ్ణికూడానండి. అలాగే ఆ శ్రీరామచంద్రులవారున్నారండి! వారి భక్తుడూ వారి సేవకుడూ అయినటువంటి ఆంజనేయస్వామివారున్నారండి. రామ భక్తిలో, రామసేవలో ఆంజనేయుడికి సాటి మరెవ్వరూ లేరండి. అయితేనండీ; ఆంజనేయుడి భక్తులు అంజనేయుడికీ ఉన్నారండి. ఆంజనేయుడి దేవాలయాలు ఆంజనేయుడికీ ఉన్నాయండి. శ్రీరామచంద్రులవారు ఆంజనేయుడి సేవలు ఎన్నయినా ఆశించవచ్చు పొందవచ్చు గానండీ; ఆంజనేయుడి తపోఫలాన్నిగాని అందులో వాటానుగాని అశించకూడదు గదండీ!" అని నమస్కారం రామచంద్రరావువైపూ ఆపేక్షగల చూపు లీలారాణివైపూ పెట్టాడు ఆంజనేయులు.

"ఆహాహా! ఏమి నిజం చెప్పేవయ్యా!" అని అక్షరాలా లెంపలు వేసుకున్నాడు; "ఆంజనేయ భక్తుడు" రామచంద్రరావు. *

[కీర్తిశేషుడు సంకు పాపారావు అలవోకగా చెప్తూ ఉండే అనేక జీవిత సత్యాలలో ఒకటి విని ఈ కథ రాయకుండా ఉండలేకపోయాను. మా అధికారి తిరుపతిరాజుగారు నన్ను పిలిపించి ఈ కథలోని అధికార వ్యవస్థపట్ల నేను వ్యక్తపరచిన పరిశీలనాశక్తి తమకెంతో సంతృప్తిని కలిగించిందని చెప్పడం విశేషం.]